
# ప్రేయసీ నీ పేరు రాక్షసి

శ్రీసుభా



"నను! ఇమ్మన్నానని లక్ష్మి గారింటికి వెళ్ళి పూజకి మందార పూలు తెచ్చిపెట్టు" అంది సీతమ్మగారు పదేళ్ళ కొడుకు శేషశాయితో.

అయినా శేషశాయి కదల్లేదు.

"ఏరా వెళ్ళి రమ్మంటూ ంటే నీకాదూ..."

"శశిరేఖ కొడుతుందే, నే వెళ్ళను" అన్నాడు బిక్కమొహంతో శేషు.

సీతమ్మగారు నవ్వి వూరుకుం... ఈ విషయం ఆవిడకు తెలియందికాదు. రోజూ ఆటల్లో శాయిని శశిరేఖ ప... గొట్టో తలనిండా యిసికజల్లి అల్లరిపెట్టి యేదో ఒకటి చేస్తూనే వుంటుంది. రోజుకో పలకవుల్ల, పెన్సిలూ, కొడు... పోగొట్టుకోవడం లేదనీ ఎనిమిదే... యినా నిండని శశిరేఖే వాటిని కాజేస్తుందనీ ఆవిడకు తెలుసు. లక్ష్మమ్మగారు అప్పుడప్పుడు కూతురుచేసే అగడాలకు సీతమ్మగారిని క్షమాపణలు అడుగుతూ వుంటుంది. సీతమ్మగారు వీటిని పట్టించుకోకపోయినా లక్ష్మమ్మగారికి భం... మెక్కువ. ఏవిధంగా చూసినా అం...రాలు చూపే అంతన్ను, తమ రెండు కుటుంబాల మధ్య వుందనీ, తన సోదరి భర్తతో, సీతమ్మగారితో పోటీ ప...లేనని తెలుసు. అయినా సీతమ్మగారు ఇవేం పట్టించుకోదు. తనకు చేతనయినా కాకపోయినా అయినంతలో అందరి సహాయం చేస్తూనే ఉంటుంది. ఈ సహాయం చేసే నైజం శేషశాయికి తల్లినుంచి అలవడింది.

తిరిగిపోయిన చొక్కాలు తొడుక్కు... ముక్కలుతూ వచ్చే కుర్రాళ్ళని, బో... మేశలతోవచ్చే ఆడపిల్లల్నిచూస్తే అతని చిన్నప్పటినుంచీ భయంగా వుండేది. తమింట్లో ఫొటోలకే ఖరీదయిన దండలు వ్రేళ్లాడుతూ వుండటం, అతనికి తెలుసు. తల్లి దేవుడి మందిరంలో బంగారు ఆభరణాలు అలంకారాలుగా వుంచడం చూశాడు.

ముఖ్యంగా ఈ భయం — సోదరీమణుల చేతులతో, పొట్టి గిట్టు అం...

నేయులబిళ్ళ దండతో శకుంతలని చూసినప్పుడు వేయింతలు అయ్యేది.

ఓ రోజు సాయంకాలం తల్లి చూడకుండా వేంకట రమణమూర్తి ఫొటోకి వున్న కర్పూరపు దండ తీసుకువచ్చి శకుంతల చేతిలోపెట్టి "వేసుకుంటావా మెళ్లో" అని అడిగాడు.

"ఛా, సున్నపుండల దండ" అనిచిదిమి

పారేసి అతని మొహాన కొట్టింది. ఈ విషయం అతను మర్చిపోలేదు, స కదా చాలా రోజులు గుర్తు తెచ్చుకు "శకుంతలకి ఏం తెలియదు" అనుకు వాడు.

● ● ●

శకుంతల తండ్రి వెంకట్రామయ బ్రతికి చెడ్డవాడో చెడి బ్రతికినవాడ ఆ అమ్మాయికి తెలియదుగానీ జ్ఞాన తెలియని రోజుల్లో — తండ్రి పిచి వాడిలా మండువా వాకిట్లో వుయ్యా మీద పడుకుని ఆలోచించడం కొద్ది గుర్తు. తల్లి వంటింట్లో కూరలు త కు్కంటూనో, లేక తండ్రికి అన్నం వ స్తూనో కన్నీరు కార్చడం తెలుస. ఏదో అర్థంకాని చీకటి, ఓ భయంక మైన బాధ ఆయన గుండెల్లోది — ఇల్లంతా మసి పొగలా వ్యాపిం వుండేదనీ, అదే బీదరికమనీ ఈ రోజ తాత్పర్య సహితంగా తెలిసొచ్చింది.

తన పదేళ్ళనాడు — గ్లాస్కో పం కట్టుకున్న పెద్దమనిషి చేతి వుంగ వేలితో తండ్రిని బెదిరిస్తూంటే, ఎండ ఆ వుంగరంలో రాయి మెరిసి త కంటిని జిగేల్ మనిపించడం తెలుస. మరో రోజు డప్పులవాడూ మ కొందరూ వచ్చి గోల చేస్తూ త ఇంట్లో సామాన్లు బయటకు తే చెయ్యడం, ఆ రాత్రి తండ్రి భుజంమీ మూగన్నుగా నిద్రపోతూనే, త ప్రయాణం చెయ్యడంలో వుద్దేశ గమ్యం యివాళ అర్థమయ్యాయి.

"మనం అప్పట్లో వున్నవాళ్ళ శకుంతలా, దురదృష్టంకొద్దీ తరి పోయింది. ఆయన్ని మింగేసింది."

"ఏం జరిగిం"దని అడగాలనిపిం లేదు శకుంతలకి. వింటోందంతే.

"మీ నాన్నని వీధిలో నిలబెట్టిం మీ చిన్నాన్నే. డబ్బు కాపీర్ణం ఎం పనైనా చేయిస్తుంది."

ఆ గ్లాస్కో పంచె, సిల్కు కండువ, ఎర్రపొడి, వుంగరం చేతివేలు, శశిరే ఎప్పుడూ మర్చిపోలేక పోతోంది. చిన్న వయసులోనే ఆమెకు ద్వేషం నేర్పిన ఆ ముడి సరుకులు ఆలోచనలోకి రాగానే ఆమె కళ్ళు క్రోధంతో చింత నిప్పులవుతాయి. తను యివాళ చదువు కుంటోంది. మంచీ చెడూ విచక్షణ తెలుసు. అయితే మాత్రం మనసు మీద ముద్ర వేసుకున్న అభిప్రాయాలూ, మెదడులో నాటుకున్న వుద్దేశాలూ మార్చుకునేందుకు యిష్టం కల గదు. తను దరిద్రదేవత కడుపున పుట్ట లేదు. కానీ దరిద్రం అంటే రుచి చూసింది, అనుభవించింది. తప్పు చెయ్య లేదు. శిక్ష అనుభవిస్తోంది. స్కూల్ ఫైనల్ ప్యాసయిన తను, అతికష్టంమీద, తల్లి శక్తిమీద బ్రతుకు నిల్పుకున్న తన జీవిత లక్ష్యం యేమిటి? రాబోయే రోజుల్ని ఎలా ఎదుర్కోవాలి?

శశిరేఖలోని ఈ ప్రశ్నలకు యిరవై యేళ్ళ శేషశాయి జవాబు చెప్పాలనుకున్నాడు. శశిరేఖ ప్రశ్నిస్తే జవాబే కాదు మాటే మాట్లాడలేని శేషు, ఒక రోజు శశిరేఖని కొద్దిరోజుల్లో స్వగ్రామం విడిచి వెళ్ళేముందు అడిగిన ప్రశ్న ఒకటే ఒకటి "నేను పట్నం వెడుతున్నాను. నువ్వు వెళ్ళద్దంటే మానేస్తాను, చెప్పు."

"నేనేం చెయ్యమంటే అది చేస్తావా?"

"ఆ..."

"అయితే గంగలో దూకు."

శేషు పాపం మాట్లాడలేకపోయాడు. అతన్ని మాట్లాడనివ్వకుండానే శశిరేఖ తిరిగి అనేసింది'

"నువ్వేం నాకు చుట్టానివా, పక్కా నివా? నువ్వెలాపోతే నాకేం? నన్ను అడగడం దేనికి? మీ అమ్మని అడుగు. నీ ఇనప్పెట్టెని అడుగు."

"నీమాట చెప్పకూడదా? స్నేహితు రాలివి అని అడిగాను."

"నాకేం తెలియదు, పో"... శశిరేఖ వెళ్ళిపోయింది.

అంతకన్నా ఎలా అడగాలో శేషుకు ఆ వయసులో తెలిసిరాలేదు. కానీ నిర్దాక్షిణ్యంగా కసిరికొట్టినా అతనిలో శశిరేఖ మీద అభిమానం తరగలేదు సరికదా పెరగడానికి మరో విత్తుని నాటిందేమో. అందుకు తెల్లవారు ఝామున వెళ్లిపోతూ బజారులో కొన్న బంగారు జూకాలు శశిరేఖ కంపాస్ బాక్సులో పెట్టి "నీకు" అని వ్రాసిపెట్టి బయటకు వచ్చేశాడు.

అది వయసు, శరీరానికి ఖచ్చితంగా ఏం కావాలో తెలియచెప్పని కాలం. అయినా మనిషిలో చిన్నప్పటి నుంచీ — ప్రకృతిలోవున్న మమత అనే శక్తి — వాక్కొక్క విత్తునినాటి చుట్టూ దాన్ని ద్వేషించే, లేక ఆరాధించే అవకాశం కల్పిస్తూ వుంటుంది. ఇరవైయేళ్ళ వరకూ విజ్ఞానంకోసం, ఆ తరువాత తనకోసం, స్వంతం కోసం విలవిల్లాడే తపనతో, మరో గతిలో యెదటివాళ్ళని తన వాళ్ళుగా మార్చుకోవాలనే పోరాటంతో, ఆపైన ఒకరిని అర్థం చేసుకునేందుకో, హృదయాంతరాలనిండుగా ఆఖరిగా బాధ్యతల నిర్వహణ అనే విశ్రాంతి కోసం, అంతిమంగా శాశ్వత శాంతికోసం — యిలా రకరకాల మార్పిడీలు తెస్తూ జీవిని ప్రపంచ సమరంలో వూపి వుక్కిరి బిక్కిరిచేసి తుదిగా తనలోకి తీసుకుంటుంది ప్రకృతి.

ఇవాళ శేషుకు చుట్టూ చూస్తే అందం కన్పిస్తోంది. ఆ అందం గురించి తీవ్రంగా ఆలోచిస్తే శశిరేఖ గుర్తుకు వస్తుంది... సరిగ్గా ఆ క్రితంరోజే దేవుడి గుళ్ళో తల్లి శశిరేఖని చూశానని చెప్పి వివరాలు చెబుతూంటే శేషులో నాలుగేళ్ళనాటి ఆప్యాయత కొత్తరంగుల పురి విప్పింది. వాళ్ళ ఆర్థిక పరిస్థితులు వింటూంటే భయపడ్డాడు.

వారం తరువాత శశిరేఖ కన్పించింది. చాలా చాలా అడిగి ఏవేవో మాట్లాడాలనుకున్న శేషు శశిరేఖని చూడ్డంతో తన కంఠం ముడి ఎవరో నొక్కిపట్టినట్టు అయిపోయాడు. ఆమెలో కనిపించని జ్వాల అందంగా మెరుస్తోంది. ఆ వెలుగు కళ్ళగుండా, నొక్కుల జుట్టుద్వారా బల

మైన గుండెల స్వరూపం నుంచి, అతి చిన్నదయిన పెదవుల కొనల నానుకుని ఎక్కడో కనిపించని భగవత్ స్వరూపంలా వుంది.

"నువ్వా" అంది ముందుగా శశిరేఖే.

"ఆ... నన్ను గుర్తుపట్టవేమో అనుకున్నాను తెలుసా."

"అప్పుడే మర్చిపోయాను. కానీ నిన్ను చూడ్డంతోనే ఆ పుట్టుమచ్చ మూలంగా జ్ఞప్తికి వచ్చింది."

నవ్వబోయాడు—అతను.

"ఎక్కడ వుంటున్నారు."

"ఏం వైనాలు అడుగుతున్నావ్ ?"

"నేను తెలుసుకో కూడదా — ఆ మాత్రం."

"మా గురించి మరొకళ్ళు పట్టించుకోవడం నా కిష్టం వుండదు..." చేతి వేళ్ళని, గోళ్ళని చూసుకుంటోంది.

శేషుకి జవాబు లేదు.

"వస్తాను..."

శేషు వెనకగా శశిరేఖని చూశాడు ...తల్లో పువ్వులు లేవు ... చీరకూడా మామూలుదే...తను కంపాస్‌బాక్స్‌లో పెట్టిన జూకాలు గుర్తొచ్చాయి. ఆవి చెవినలేవు. అయాచితంగా లభించే యేవస్తువునూ శశిరేఖ స్వీకరించదు. తనకు తెలుసు. అయితే ఏమయినట్టు ?

ఇవాళ తనకన్పిస్తుంది శశిరేఖ తనని అపార్థం చేసుకుందేమోనని. తనెప్పుడూ శశిరేఖతో కలివిడిగా మాట్లాడలేదు - భయంభయంగా ప్రవర్తించాడు. తన ప్రవర్తన మూలంగానే శశిరేఖ తనని అర్థం చేసుకోలే దూరమవుతోందేమో.

అందుకే కొద్ది రోజుల తర్వాత పని కల్పించుకుని లక్ష్మమ్మగారింటికి వెళ్లాడు. అశ్రద్ధను సంపాదించడానికి తనుపడ్డ అవస్థలు శశిరేఖతో చెబితే ఆపైన శశిరేఖ నవ్వితే - ఆ నవ్వు



మూలంగా బుగ్గలో ఏర్పడ్డ సొట్ట చూడాలని వుంటుంది.

శేషుని చూస్తూనే మర్యాద చేసింది లక్ష్మమ్మగారు. అప్పటికి శశిరేఖ ఇంట్లో లేదు. మామూలు విషయాలు మాట్లాడుతూనే శశిరేఖ పెళ్ళి గురించి ఆవిడే చెప్పింది.

"దానిని పెళ్ళి చెయ్యగల్గితే చాలు నేను మరేం కోరుకోవడం లేదు బాబూ..."

"అన్నిటికీ భగవంతుడే వున్నాడు."

"నేనేం ఇచ్చే స్థితిలోలేను. ఎలా అవుతుందో ఏమో."

పర్యవసానం కుదరని మాటలు, గతంలో కష్టాలు, వర్తమానంలో నడత, ఆపైన భవిష్యత్ మీద ఆశ - ఇవే ఆవిడ చెప్పింది.

ఇంటికివస్తూ శేషు లక్ష్మమ్మగారికి తనేం జవాబులు చెప్పాడో మర్చిపోయాడు. అతని ఆలోచనా కేంద్రంలో ముఖ్య బిందువుగా శశిరేఖ కన్పిస్తోంది ... తనేం త్యాగం చెయ్యడంలేదు. ఇది ఘనకార్యంగా భావించడమూ లేదు. శశిరేఖ అనే అందగత్తెను తను కావాలని కోరుకుంటున్నాడు. అదే శశిరేఖతోనూ చెప్పాలనుకున్నాడు.

ఆవేళ శశిరేఖ కన్పించింది. శేషుని చూడగానే అడిగేసింది.

"నువ్వు మాయింటికి వచ్చావుటగా?"

"అవును. నువ్వు..."

"నేను లేకుండా చూసే యెందుకు రావాలి ?"

"అదేమిటి. అసలు నువ్వు వుంటావనే వుద్దేశంతోనే వచ్చాను తెలుసా" నవ్వబోయాడు.

"అబద్ధం."

"నా మాట ఎప్పుడు నమ్మావుకనుక."

"నే నెందుకు నమ్మాలిట. శేషూ నువ్వు నా పెళ్ళి గురించి అమ్మతో మాట్లాడ్డం వ్యర్థం. నేను పెళ్ళి చేసుకోను. నిన్నే కాదు. ఎవన్నీ కూడా."

"ఎందుకని."

"నీకు కారణం చెప్పాలా ?"

"అవును" సక్రోషంతో అన్నాడు.

"ఎందుకో."

"మనం చుట్టాలం కాకపోవచ్చు. స్నేహితులం కూడా కాదనుకుందాం. క్లాసీ పదేళ్ళు ఒకే వీధిలో వుండి ఒకే బళ్ళో చదువుకున్నాం. ఇక నువ్వు నన్నే బాధ పెట్టావుగానీ నేను నిన్నెప్పుడూ ఏమీ అన్న వాణ్ణి కాదు. ఆ చనువుతో నీ మేలు కోరిన వాడితో ఆ మాత్రం చెప్పచ్చుగా."

"నేను చెప్పను. నాతో చాలామంది చదువుకున్నారు. అందుకని అందరూవచ్చి సలహాలు ఇస్తే నేను వినాలా, పాటించాలా..."

"నేనూ వాళ్ళలోనే జమా."

"ఆ... కాక..."

శశిరేఖ నవ్వింది. కోపంమీద తెర చటుక్కున తప్పించి విద్యుత్ వేగంతో హేళన మిళితం చేసింది.

"ఛీ ఛీ నువ్వు మనిషివి కాదు."

"కాకపోతే కాకపోనీ..."

"శశిరేఖా ఏమిటా మొండి సమాధానం" అప్రయత్నంగా అన్నాడు.

"నా ఇష్టం."

శేషు తగ్గిపోయాడు. నెమ్మదిగా అన్నాడు. "చిన్నప్పటి నుంచీ నువ్వు నన్ను డామినేట్ చేయడం అలవాటు చేసుకున్నదానివి. అంత త్వరగా అలవాటు మారదులే. కాని ఒక్క మాట నేను చెప్పినదాంట్లో అడిగిన దాంట్లో ఏఒక్కటైనా నీమేలు కోరింది వుంటుందని యెందుకనుకోవు."

"మహాప్రభూ నా గురించి నువ్వేమీ కావద్దు. నేను వెడుతున్నాను. వెళ్ళే ముందు మళ్ళీ చెప్తున్నాను. నే నంటే నీకు సానుభూతి వుంది కదా అని నిన్ను నేను అభిమానించలేను. ఒక విధంగా చెప్పాలంటే నువ్వంటే..."

ఎందుకో శేషశాయి మొహంచూసి ఆగిపోయింది. తిరిగి అంది.

"చెబితే బాధపడతావు. వస్తా మరి" చరచరా వెళ్ళిపోయింది.

శశిరేఖ వదలిన స్థలంలో ప్రళయం తర్వాత ప్రశాంతత మాత్రమే అతనికి కన్పించింది.

"శశిరేఖ అసలు మనిషి కాదేమో" అనుకున్నాడు మొదటిసారిగా శేషు.

● ● ●

శశిరేఖతిరస్కారంతో శేషుజీవితంలో అనుకోని మార్పు యేమున్నా జరిగిందా అంటేఅది వొకటే వొక్కటి. అతను అవివాహితుడిగానే వుండిపోయాడు ఇప్పటివరకూ కూడా. అయితే దానికి కారణం పూర్తిగా శశిరేఖ మీద వ్యామోహం గానీ తరగని ప్రేమ అని గానీ చెప్పకునేందుకు అవకాశం లేదు. నా వుద్దేశంలో శేషు నా ముందు దాచిపెట్టాడేమో అన్పించింది. అందుకే అడిగాను. శేషు చెప్పాడు.

"చాలామంది యేదో కారణం వుండి జీవితంలో మోసపోతుంటారు. చేసిన పొరబాట్లో, వేసిన తప్పటడుగో మెడపట్టి జీవితాన్ని పంజరంలో బంధిస్తుంది. కానీ నాకు తెలియకుండానే నేను పంజరంలో బంధించబడ్డాను. అసలు నా ఉద్దేశంలో నా అంతటనేనే పంజరంలోకి చొరబడ్డానేమో నని."

నాకు అర్థం కాలేదు.

"నువ్వు శశిరేఖని మర్చిపోలేకపోతున్నావు కదూ."

"శశిరేఖని కాదు. శశిరేఖ తీసిన దెబ్బని."

"అంటే..."

"ఏడాదినాడు జరిగిన సంఘటన నీకు తెలియదు కదూ. విను. ఇలాంటి చరిత్ర ఇంతకు ముందెవరూ నీకు చెప్పివుండరు. విన్న తరువాత నీ అభిప్రాయాన్ని మాత్రం చెప్పకు. నేను భరించలేను."

● ● ●

రామారావు ఏం లేనివాడు. ఎవరూ లేనివాడు కూడా. అతనికున్నది వొకటే వొక్కటి. అది రెండువందలు గడించిపెట్టే ఉద్యోగం. ఆ ఉద్యోగంకూడా పట్టణంలో మూలంగా అతను చాలా మందిలా వొడిదుడుకులు పడ్తూనే వున్నాడు. జీవితంలో చాలా ఆశించి వున్నతమైన కలలు కని ఆ కలలన్నీ విఫలమయితే చేదైన వాస్తవంలో డ్రీమర్‌గా బ్రతికే మనిషి.

లక్షాధికారి కూతుర్ని ఆపైన హోదా కట్టబెట్టే వుద్యోగాన్ని, తన తెలివికి సరితూగే చదువుని - యిలాంటివన్నీ వూహించి జీవిత పరీక్షలో విఫలుడైన విద్యార్థి రామారావు. అతను ఇలాంటి దౌర్భాగ్యమైన కలలుకనడానికి ముఖ్య కారణం అతని స్నేహితులందరూ ధనవంతులు కావడమే. వాళ్ళ మాటల్లో వారి స్నేహితంతో రోజూ యింటికి వచ్చి కలల కుబుసాలు విడుస్తూ వుండేవాడు. ఇది అతని రొటీన్ లైఫ్. వాస్తవ జీవితంలో మటుకు తద్వ్యతిరేకంగా జరిగిన మూలంగా అతనికి సంసారం అంటే వ్యతిరేకంగా జరిగిన మూలంగా అతనికి సంసారం అంటే విరక్తి. తనని మామూలు అవసరానికి, అతి సాదా సంఘటనలతో బంధించే భార్య అంటే ద్వేషం. తన రూపానికి అద్దాల్లాంటి యిద్దరు పిల్లలూ అంటే అసహ్యం. అతనికి మరో వింత అయిన నైజం వుంది. స్వంతబాధలూ, యిబ్బందులూ అతను గోప్యంగా కాపాడు కోలేడు. ఎవరి ముందో వొకరి ముందు విడమర్చి సానుభూతి సంపాదించకపోతే అతనికి వెర్రెత్తిపోతుంది. అందుకే అతనికి స్నేహితుల అవసరం అందరికన్నా ఎక్కువ.

ఓ రోజు అంత దూరాన వెడుతున్న శేషుని పిల్చి పిచ్చాపాటీలోకి దింపాడు.

తన గోడంతా చెప్పి తశ్శాంతి లభించిన తర్వాత అడిగాడు.

"నీ బ్రతుకెలా వుంది మరి."

ఏమిటోరా. ఏ పనీ చేయ బుద్ధి వెయ్యదు. మానసికగ్లాని అంటారే ఆ వ్యాధితో బాధపడుతున్నాను."

స్వంత కష్టాలను మించినవివిన్నప్పుడు మనిషి చాలా తేలిగ్గా స్వీయాన్ని మర్చిపోయి యెదటి వాడికి సానుభూతి అందించడంకోసం విశాలమయిపోతాడు.

"చిన్న చిన్న విషయాలకు బాధపడితే ఎలా. ఈలెఖ్ఖన నా కష్టాలయితే చిత్తయిపోయేవాడివి. అయినా సాంఘిక పరమైన నా కష్టాలూ, మానసిక పరమైన నీ యిబ్బందులూ తారుమారయితే చూడాలని వుంది..." రామారావు నవ్వాడు.

ఆ రోజే రామారావు శేషుని తనింటికి అతిధిగా తీసుకు వెళ్ళాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. వాకిట్లో ఓకర్ర కుర్చీ, పడక కుర్చీలు, గోడలకు మామూలు పటాలు. వంటింట్లోంచి అప్పుడప్పుడు గిన్నెల చప్పుడు ఆ తరువాత ఏదో టిఫిన్ తయారు చేస్తోన్నట్టు పోపువాసన.

శేషు అన్నాడు. "కుర్రాళ్ళు ఇంట్లో లేరా."

"స్కూల్ నుంచి రాలేదనుకుంటాను. ...ళ్ళింట్లో వున్నారంటే యింటి పెంకులు గురుతూ వుంటాయి, అదేగుర్తు" తను మకూర్చుకున్న పుస్తకాలు స్నేహితుతో తీయించుకున్న ఫొటోలు, వాళ్ళ ద్యోగవైనాలూ, వొక్కొక్కటే వివరంగా ...ప్తున్నాడు రామారావు. శేషు మొత్తం ...ల్బమ్‌లో రామారావు పెళ్ళి ఫొటో ...న్పిస్తుందేమో నని చూశాడు.

అందుకే అడిగాడు. "ఏరా యిన్ని ...టోలు వున్నాయి, మీ పెళ్ళి ఫొటో ...నబడదేం యెక్కడా" అని,

రామారావు శేషుని కాకుండా పక్కగా చూస్తూ అన్నాడు. పెళ్ళి ఫొటో ...లో ఒకళ్ళనొకళ్ళు అంటిపెట్టుకుని వున్న ...డదీ మొగవాడూ నిజజీవితంలో అలా వుండడానికి యెక్కడా అవకాశం లేదని నా నమ్మకం, ఆడది ఒక వైపుకూ, మగవాడు మరోవైపుకూ లాగుతూంటే ఛిన్నాభిన్న మవకుండా యెన్ని సంసారాలు నిలుస్తున్నా యంటావ్. అందుకే వాస్తవాన్ని దాచిపెట్టే యే చిత్రం నాకు నచ్చదు."

"లోపలకి వస్తారా" తెరవెనక నుంచి రామారావు భార్య కంఠం విన్పించింది. శేషు చూశాడు. తెర క్రింద భాగం లోంచి మట్టెలతో వున్న రెండు పాదాలు, జరీ అంచులున్న చీరకుచ్చిళ్ళూ కన్పించాయి.




రామారావు గుమ్మంవరకు వెళ్ళి తెర తప్పించి అన్నాడు.

"నా చిన్ననాటి స్నేహితుడు శాయి వచ్చాడు. వచ్చి కన్పించు, లేకపోతే వాడు నన్ను ఆడిపోసుకుంటాడు."

రామారావు అడ్డు తప్పుకున్నాడు.

భర్తతో కలిసి వస్తున్న — వచ్చి భర్త పక్కన కుర్చీలో కూర్చున్న శశిరేఖని చూశాడు.

"ఈవిడే మా ఆవిడ !"

శేషు అన్నాడు. "మీ ఆవిడగారు చిన్నప్పుడు నాకు తెలుసు. మేం ఒక వూళ్ళోనే ఒక స్కూల్లోనే చదువుకున్నాం. బహుశా ఆవిడ మర్చిపోయి వుండచ్చు."

"చిన్నప్పుడు మీ యిద్దరూ స్నేహితులు. పెద్దయిన తర్వాత మనిద్దరం కాలేజీ ఫ్రెండ్స్, బావుంది. మన బాంధవ్యం చాలా గట్టిదన్నమాట. ఏం శశిరేఖా శాయిని గుర్తుపట్టలేదా నువ్వు?" భార్యని ప్రశ్నించాడు రామారావు.

"ఆ పుట్టుమచ్చ బుగ్గమీదది, దాని మూలంగానే గుర్తుపట్టాను" అంటూ భర్తకి సమాధానంచెప్పి—

"మీ అమ్మగారు బావున్నారా" అని శేషుని ప్రశ్నించింది.

"ఆ."

"నేను వెడతానండీ. వంట చూసుకోవాలి" శశిరేఖ లేచి లోపలకు వెళ్ళిపోయింది.

రామారావు ఎన్నో విషయాలు తన సహజధోరణిలో చెప్పాడు.

శేషు వెళ్ళేముందు తిరిగి కన్పిస్తానని మాట తీసుకుంటేగాని రామారావు అతన్ని వదల్లేదు. శేషు శశిరేఖ గురించే ఆలోచిస్తున్నాడు. తను జీవితంలో తిరిగి చూడననుకున్న, చూడలేననుకున్న శశిరేఖ కన్పించింది. ఇది తనకుగానీ ఆమెకుగానీ ఆనంద హేతువే అవ్వాలనీ— మరేవిధంగానూ వికటించి వెర్రితలలు

వేయకూడదనీ కన్పించని దేవతలకు మొక్కుకున్నాడు.

● ● ●

శేషుని తిరస్కరించిన తర్వాత శశిరేఖకు అతనిగురించి ఆలోచించాల్సిన అవసరమే కలగలేదు. తల్లి ఒకటికి రెండుసార్లు శేషుగురించి మాట్లాడితే "పోనిద్దూ" అని విదిల్చి పారేసింది. అంతటితో కూడా ఆవిడ వూరుకోక పోతే "శేషు తప్ప ప్రపంచం గొడ్డు పోయిందేమిటి, మాట్లాడుకునేందుకు" అనేది.

"ఎందుకే అతనంటే మండిపడతావ్."

తన పెళ్ళిగురించి తల్లి ఎంతగా తహ తహ లాడుతోందో శశిరేఖ వూహించలేదనుకుంటే అది తప్పే అవుతుంది. తల్లిమాటల వెనకవున్న ఆతృత శశిరేఖ ఎప్పుడో పసిగట్టింది. ఎంతో మంది వయసుకారు వాళ్ళూ వయసు మించినవారూ కూడా తను కాలేజీ నుంచి వచ్చే టైముకు వీధిలో నిలబడ్డం తెలుసు. పెళ్ళి అనే పరిష్కారం తన జీవితంలో ఎలాంటి మార్పు తెస్తుందో ఎంతవూహించినా ఆమెకు అర్థం కావడంలేదు. తనకన్నా వున్నతుడయిన వాడా లేక తమ హూదాతో సరితూగే మనిషా. వీరిలో యెవర్ని యెన్నుకోవాలి తను. లక్ష్మమ్మగారు – తనకు తానుగా యింటికివచ్చిన దూరపు బంధువుద్వారా సంబంధం తెల్సుకుని పెళ్ళికొడుకుని చూసి వచ్చింది. పెళ్ళికొడుకు వచ్చి శశిరేఖని చూశాడు. శశిరేఖ పెళ్ళి చూపులరోజు ఆ మనిషిని పరకాయించి చూసింది. తనని చూసి ఎటువంటి మార్పూ పొందని రామారావు ఆమెకు ఆశ్చర్యం కల్గించాడు.

రామారావు అనే తన భర్త తనని మనసారా వరించి పెళ్ళిచేసుకోక పోయినా మనసువిప్పి ప్రవర్తిస్తాడనీ అనుకుంది. తనేం కలలు కనలేదు. వాస్తవం, వాస్తవంలాగే జరిగిపోతే చాలు అనేదే తనకోరిక. కానీ పెళ్ళి అయిన కొద్దిరోజులకే భర్త ప్రవర్తన మబ్బుచాటు వేసవి కిరణాల్లా తీక్షణంగా కన్పించింది.

"మీ వాళ్ళు నా పీకకు కట్టబెట్టారు నిన్ను."

"మీరేగా నాపీకన మూడు ముళ్ళూ వేసింది."

"నీద్వారా ఏం కోరికలు తీరాయని నాకు."

"అన్ని కోరికలున్నవారు నన్నెందుకు చేసుకున్నారు. నేను మీగురించేం ఏడ్చిపోయానా ?"

"మా అమ్మా నాన్నా యేడ్చిపోయారు. ఇల్లరికం వెడతానంటే గుండె పగిలేటట్టు యేడ్చారు. నేనెక్కడ సుఖపడతానోనని వాళ్ళకి కన్నెర్ర. చిన్నప్పటినుంచీ అంతే. పెంపకం యిమ్మని పిన్ని అడిగితే ఆరోజూ కాదన్నారు. ఏదోవిధంగా నాకు ప్రాణాంతకంగా అడ్డుతగిలారు. ఈ సొదా చదువు, చవకబారు బ్రతుకు, ఏలాంటి భార్య నేనసలు వూహించలేదు తెలుసా. మామూలు మనిషినయినా కలల్లో రాజులా బ్రతికాను. ఆ కల కూడా నిజమయ్యేది నువ్వు కనబడక పోతే. నాది వెధవబ్రతుకు..."

చరచరా వెళ్ళిపోయిన రామారావుని చూసి శశిరేఖ ఖిన్నురాలయిపోయింది. తనకూ భర్తకూ ఎక్కడా పోలికలేదు. ఆ రోజుకు ఈ విషయం నిర్ధారణ అయ్యింది. అతను కలలుకంటూ వాస్తవాన్ని కాలదన్నే మనిషి. తనది వాస్తవాన్ని విడిచి అడుగు కదల్చడానికి ఇష్టపడని తత్వం.

ఇన్నికలలుకనే మనిషితో తనముందు జీవితం ఎంతటి నరక సాదృశ్యమో ఆమె వూహించుకుని భయపడలేదు. బాధపడిందంతే. సాధ్యమయినంతవరకూ భర్తని కలలు కనడం అనే దురభ్యాసం నుంచి తప్పించాలని చూసింది. కానీ శశిరేఖ ఒక్కటే ఆలోచించలేకపోయింది. తన అభిప్రాయాలూ, ఆదర్శాలూ తనని ఎంత బలవత్తరంగా బానిసను చేసున్నాయో, అలాగే రామారావుకూడా కలలకు పూడిగం మాత్రమే చెయ్యగలడనేది ... ఈమధ్య రామారావు తరుచు శేషుగురించి మాట్లాడుతూ వుండడం, అతనికి బ్రతుకు ప్రసాదించిన అదృష్టాల గురించీ చెప్పడంతో శశిరేఖ విసుగేసి అంది.

"వాళ్ళగురించీ వీళ్ళగురించీ ఆలోచించి బుర్ర పాడుచేసుకోకపోతే మీగురించి ఆలోచించుకున్న వాటిలో మీకుగా మీరు ఏం సాధించారు ?"

శశిరేఖ మాటలకు బదులుచెప్పి ఖండిస్తాడు తప్ప ఎప్పుడూ ఒప్పుకోడు. అలాంటిది ... నవ్వుతూ అన్నాడు.

"శేషులాంటి స్నేహితుడు ఎవరికో గాని దొరకడు. మరో విశేషం అతని పరిస్థితులాంటివి కూడా ఎవరికీ వుండవు. లక్షరూపాయల ఆస్తి తరగడం ఎలా ? కొంత వ్యాపారానికి అప్పుపెట్టమని."

"అంటే !"

"శేషుని అడిగాను. సమాధానంరేపు చెపుతానన్నాడు" చిన్నతనంలో తన యింటిలో చూసిన దృశ్యం, శేషుని అతి తేలిగ్గాతిరస్కరించినరోజులు, డబ్బున్న ప్రేమికుల్ని అసహ్యించుకున్నరోజులు. గిర్రున తిరిగాయి తలలో. తను యే మార్గాన్వేషణలో జీవితం అంతా గడపాలనుకుందో యే ఆదర్శాన్ని నమ్ముకుందో అది ఇవాళ తునాతునకలవుతోంది. తను పెంచి పోషించుకున్న ఆదర్శాన్ని భర్త గొడ్డళ్ళతో నరకడానికి ప్రయత్నిస్తున్నాడు. దయాధర్మాల్ని – తను తిరస్కరించిన వ్యక్తినుంచే ఆశిస్తున్నాడు.

"వద్దు మీకు పుణ్యం వుంటుంది. అలాంటిపని చెయ్యకండి. మనచేతకాని తనంతో లేమితో మరొకళ్ళని అర్థించడం అసహ్యం."

"శేషు నాకు స్నేహితుడు"

"అతను నాకూ తెలుసు. నేనే మీ పరిస్థితిలో వుంటే చచ్చినా ఆ పని చెయ్యను."

"నువ్వు పిచ్చిదానివి కాబట్టి" రామారావు బయటకు వెళ్ళిపోయాడు. శశిరేఖకి ఏం చేయాలో అర్థంకాలేదు.

● ● ●

మరునాడు శేషు వచ్చేసరికి రామారావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు శశిరేఖతో చెప్పాడు, శేషు వస్తే మర్యాదచేసి కూర్చోపెట్టమనీ తను గంటలో తిరిగి వస్తాననీ.

"రామారావ్ "వీధిలోంచి పిలుస్తునే లోపలికి వచ్చాడు. వచ్చేసరికి వాకిట్లో వంటరిగా కూర్చున్న శశిరేఖ కన్పించింది.

"కూర్చో. ఆయన ఆఫీసులో అర్జంటు పని వుందని కబురువస్తే వెళ్ళారు. అర గంటలో వచ్చేస్తానని చెప్పమన్నారు."

"కుర్రాళ్ళు స్కూల్‌కి వెళ్ళినట్టున్నారు."

"అవును"

ఈసారి శేషుకేం ప్రశ్నించాలో తెలియలేదు. కానీ శశిరేఖ అడిగిన ప్రశ్న – మాట వినబడింది.

"నేనో మాట అడగాలనుకుంటున్నాను. శేషూ. నువ్వెందుకు నామీద పగబట్టావు"

శశిరేఖ అడిగిన యీ ప్రశ్న అతను వూహించలేదు. తెల్లబోయి అనగల్గాడు "నేనా" అని.

"అవును అయన్ని పాడుచెయ్యాలని, ఈ బ్రతుకుకూడా బ్రతక్కుండా అణగదొక్కాలనీ ఆ విధంగా నామీద పగ సాధించి" వొక్కొక్కమాటా తీవ్రగానే అంటోంది.

శేషు తలవంచుకుని అన్నాడు. "నీ మీద కోపం వుందనుకుంటే, నువ్వింకా నాలుగేళ్ళు వెనకేవుంది ఆలోచిస్తున్నావన్నమాట. నన్ను మర్చిపోయావని కనపడ్డప్పుడల్లా చెబుతూనేవున్నావు. అలాగే నేనూ నిన్ను – అదే, నీ గురించి ఆలోచించడం లేదని ఎందు కనుకోవు ?"

"అది అబద్ధం..."

"నేను నీతో వాదించలేను. కానీ రామారావు నా కూడా స్నేహితుడే, అది మాత్రం మర్చిపోకు."

శశిరేఖ తన ధోరణిలోనే అంది. "ఆయన తత్వం నీకు తెలియదు.. డబ్బుకోసం, అయాచితంగా వచ్చే డబ్బుకోసం ఆయన ప్రయత్నం యివాళిటిది కాదు. జ్ఞానం వచ్చినప్పటి నుంచీ ఆయనకదే కోరిక. ఇంతవరకూ అది నెరవేరలేదు. ఆలోచించు. ఒక్కసారి అందలం ఎక్కిన మనిషి, అమితంగా వెలుగుని చూసిన వ్యక్తి తట్టుకోలేడు కదూ..."

"నీకు సమాధానం చెప్పడం నాకు చేతకాదు. అది నా దౌర్భాగ్యం కానీ నువ్వూహించింది వూహించేది సరియైందిగాదేమో ఆలోచించమంటున్నాను.

"శేషూ నా అభిప్రాయాలబలం నాకు తెలుసు. అవి ఎవర్ని బాధించినా అందుకు నేను బాధ్యురాల్ని కాను. నిజం చెప్తున్నాను. నాకుస్వార్ధంకావాలి. అది నా నైజం. ఎంత కష్టమైనా సరే నా మార్గం నేను వేసుకోవాలి..."

"అయితే నే చెప్పేది లేదు, వెడతాను."

శేషు వెళ్ళి పోయాడు.

శశిరేఖ వూపిరితీసుకుంది. నెమ్మదిగా తనలోతనుగా నవ్వుకుని "నువ్వుడబ్బుతో నన్ను జయించాలనీ ఆకర్షించాలనీ చిన్నప్పటి నుంచీ ప్రయత్నిసూనే వున్నావు. వెర్రిశేషూ. నువ్వు నా చిన్ననాటి శత్రువ్వి. అది నేను మర్చిపోను" అనుకుని లేచి వీధి తలుపు వేసి లోపలికివెళ్ళి మంచంమీద వాలిపోయింది శశిరేఖ. ఏవో ఆలోచనలు ఆపైన వెర్రి కోపం, జాలి, యిలా మిశ్రమ భావాలు నిద్రలోకి తీసుకోక ముందే రామారావు వీధి తలుపు తట్టాడు.

శశిరేఖ తలుపు తెరవకముందే "శేషు రాలేదా?" అన్నాడు.

"వచ్చివెళ్లాడు."

"వెళ్ళి పోయాడా ? నే చెప్పానుగా కూర్చోమనలేక పోయావ్."

"నేనే వెళ్ళి పొమ్మన్నాను."

"ఏం, నీకేమన్నా పిచ్చెక్కిందా ... అసలు నీవుద్దేశం ఏమిటి..."

"నా వుద్దేశం ఎప్పుడూ ఒకటే. వొకళ్ళ దగ్గర చెయిజాపి యాచించడం నాకు గిట్టదు. మన బ్రతుకును మరొకళ్ళ చేత సాయం పట్టించుకోవడం కన్నా చావునయం. మీరే ఆ పనిచేయడం నాకు గిట్టదు. ఆ శేషూ, డబ్బూ తప్ప మరో గొడవలేదా మీకు."

రామారావు వుద్రేకంగా శశిరేఖనికొట్టాడుఅందినచోటల్లా. శశిరేఖ భర్తని చూసి తలవంచుకుంది. పంటిని పెదవితో నొక్కి పట్టుకుంది.

"ఇన్ని ఆదర్శాలు వున్నదానివి నన్నెందుకు పెళ్ళాడావు. ఏ సంఘ సంస్కరణో అంటూ దేశాలు పట్టిపోలేకపోయావు. శేషు డబ్బు కిట్టదుటు. నాకు తెలుసు. శేషు నిన్ను పెళ్ళి చేసుకోలేదని నీ కతని మీద ద్వేషం. అతను నాకు సహాయం చేస్తానంటే అందుకే యేడ్చి పోతున్నావు. నాకంతా తెలుసు."

శశిరేఖ గట్టిగానే అరిచింది. "అబద్ధం. అది అబద్ధం. నేనెప్పుడూ అతన్ని కోరుకోలేదు. అతనంటే నాకు అసహ్యం..."

"నోర్మూయ్, ఏడుస్తావెందుకు. ఇంకో గంటలో అమీనా వచ్చి నానా అల్లరి చేసి సామానంతా వీధిలో పడేస్తే ఆపైన నేనూ పిల్లలూ ముష్టియెత్తుకుంటూంటే ఏకంగా ఏదుద్దువుగాని."

"అమీనా" అ వొక్కమాటే శశిరేఖ నోటి వెంబడివచ్చింది.

"అవును. ఆఫీసు డబ్బు వాడేశాను శశిరేఖా, ఇంత వరకూ నీకు చెప్పలేదు, అందుకే శేషుని మరో విధంగా అడిగాను. గంటలో ఆ డబ్బు కట్టకపోతే పరువు దక్కదు. నేనూ నీకు దక్కను." వీధిలోకి వెళ్ళిపోయాడు.

శశిరేఖ భయంతో కుదించుకుపోయింది. కుర్చీలోంచి యిల్లంతా తిరుగుతోన్నట్టుగావుంది. డప్పులవాడు, అమీనా, వుంగరం చేతివేలు బెదిరింపు, ఒక్కొక్కటే కన్పిస్తున్నాయి. ఆపైన తండ్రి భుజంమీద యిరవై యేళ్ళనాడు

పోలీ నిద్ర పోయిన తనరూపం చక్రాల్లా తిరుగుతోంది.

గంట గడిచింది ...

రామార్రావు చెప్పిన మనుషులు అవునో కాదో తెలియదు. వీధిలో కోలాహలం. అతకని మాటలు, అర్థం కాని సంభాషణలు, తలుపు తోసుకుని లోపలికి వచ్చి తను సంవత్సరాలుగా కట్టుకున్న ఆదర్శాల యింటిని కలయ దొక్కే మేకవన్నె పులులు ... గోముఖ వ్యాఘ్రాలు.

"ఇలా జరగకూడదు. నేను ఒప్పుకోను" అరుస్తూ పడగ్గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుని ఏడాది దాటిన పసిదాన్ని గుండెలకు హత్తుకుంది శశిరేఖ. కళ్ళు తిరుగుతున్నాయి. వాతావరణం ప్రకృతీ స్వరూపం మార్పుచెంది కన్పిస్తున్నాయి.

● ● ●

రామార్రావు బరువుగా సాయంకాలానికి ఇంటికి తిరిగి వచ్చాడు, శేషుని కూడా తీసుకుని. వీధి తలుపు వేసివుండ్చి రెండు మూడుసార్లు పిల్చాడు. జవాబు లేదు.

మళ్ళీ పిల్చాడు.

ఎవరు తీస్తారు ఆ వేసిన తలుపుల్ని? తీయగల్గిన శశిరేఖ లేవలేదు. తీయాలని వున్నా చంటి పిల్లలు పెద్ద మంచం దిగి రాలేక యేడుస్తున్నారు.

కొద్ది సేపటికి తలుపులు బ్రద్దలుకొట్టి రామారావూ, శేషూ లోపలకు ప్రవేశించి చూసిన దృశ్యం వింతైనదీ సంతోషకరమైనదీ కాదు. శశిరేఖ ఇచ్చేది కొండంత ఆహ్వానంకాదు. సముద్రమంత దుఃఖాన్ని, ఆకాశమంత నిశ్శబ్దాన్ని, అనంతాన్నే నింపేయగల ఆవేదనని ...


"శేషు మనిల్లు నిలబెట్టాడు శశిరేఖా" అని చెబుదామని రామారావు ఆశ. కానీ శశిరేఖ బ్రతికివుంటే ఏం జవాబు ఇచ్చేదో రామారావుకు తెలియక పోయినా శేషుకు తెలుసు. అతను రామారావు గౌరవం, పరువూ నిలబెట్టి కూలేసంసారం చక్కబెట్టాలనుకున్నాడు. కానీ జరిగింది చూస్తుంటే – "శశిరేఖ వుద్దేశానికి వ్యతిరేకంగా నడిచి సహాయానికి వడ్డీగా ఆమె ప్రాణాన్నే తీసుకున్నానా" అని చింతిస్తున్నాడు ...

ఇద్దరికళ్ళూ కన్నీరు చిమ్ముకున్నాయి – మౌనంగా.

● ● ●

శేషు చెప్పిన అతని జీవితంలోని ఒక దురదృష్టకరమైన అనుభవాన్ని విన్న తర్వాత నాకు అదంతా కథ అయితేనే బాగుండుననిపించింది. వాస్తవాన్ని భరించలేని మనిషి కలలు కనడం– కలలు భయంకరమైనవి అయితే నిజం కాదుగదా అని వులిక్కిపడి మేల్కొనే మనుష్యులూ ఎప్పుడూ వుంటారు. శేషూ, శశిరేఖా, రామారావుల జీవితాల్ని నేను శోధించి చిత్రీకరిస్తున్న కారణం కూడా అదే. ఒక విధంగా ఇది నా కల. వాళ్ళు అదృష్టవంతులయి వుంటే వాళ్ళ మెదడులో జన్మించవలసిన బంగారు స్వప్నం. ఏ శక్తో వాళ్ళకి విషయాలు వెల్లడిస్తే తద్వారా ఒకరి నొకరు అర్థం చేసుకునే మానసిక శాస్త్రవివరణ. శశిరేఖ నిజాన్ని భరించలేక గుండాగి చనిపోయింది. రామారావు కలల్ని రుజువు చేసుకోలేక కళ్ళ ముందరి నిజాన్ని కాలదన్నుకున్నాడు. ఈ యిద్దరి మనుష్యులమధ్యా కదిలే తన రూపంలో ఏది నిజమయిందో అర్థం చేసుకోలేక శేషు మోసపోయాడు.

శేషు చూపించే ఔదార్యాన్ని శశిరేఖ తిరస్కరించడం నూటికి ఒకవంతైనా మెచ్చుకుంటారో లేదో నాకు తెలియదు. ప్రస్తుత ప్రపంచంలో – తెలియని మనిషైనా సరే వంచించీ, నటించీ, లేనిప్రేమను ప్రకటించీ స్వయానికి మేలు చేసుకునేవాళ్ళు ఎక్కువగా వున్నారు. వారివల్ల సంఘం మెరుపు మాయకుండా ప్రకాశవంత మవుతోందో లేక అడుగునుంచి కుళ్ళుకొచ్చే మేడి పండు మాదిరి దర్శన మిస్తోందో ఎవరికి వారే గుండెలమీద చేయి వేసుకుని, నిర్ణయం చేసుకోవాలి. నూటికి తొంభై మందిలా ప్రవర్తించడం అది నటనయినా సరే కొద్ది రోజులకు సంప్రదాయ మవుతుందని – మెదడంతా మంచితనంతో నింపుకున్న వాళ్ళు భయపడి తీరుతారు. వ్యక్తిత్వం వక్రించి, సంఘం ఎవరికి వారు చింపిపారవేసే విస్తరి అయిన్నాడు మనిషి వామనుడవుతాడుతప్ప అతనికి



వికృత స్వరూపం ప్రదర్శించుకునేందుకు ఏ కోశానా చోటు దొరకదు.

శశిరేఖ చిన్నతనం భయంకరంగా గడిచింది. దరిద్రంలో మునిగి కష్టాలతో పెరిగింది. ఆ కష్టాలని భరించడం తప్ప అవి తొలగడం ఆమె ఎరగదు. అయితే చాలామందిలా ఆమె ఈ విషయంలో అమాయకంగా పెరగడానికి వీల్లేకుండా లక్ష్మమ్మగారు చిన్నప్పటినుంచీ ఆ అమ్మాయికి తమ జీవితంలో అశుభ విస్తున్న శాపపు దినాలకు కారణాలు వివరించి చెప్పినమూలంగాశశిరేఖ భవిష్యత్ జీవిత విధానంలో అనుకోని మార్పులు ఒకటి వెనుక ఒకటి విత్తులనుండి మొక్కగా మొదలయి మానుగా నిలవ సాగాయి. తమ ఇల్లు వేలం వేసిన దృశ్యం ఆమె జీవితంలో అతి ఘోరాతి ఘోరమైన ముద్రవేసింది.

ఆమె చిన్న మెదడులో అప్పటికే ధనవంతులమీదా డబ్బుగలవాళ్ళ మీదా అసహ్యం, మరో పెద్ద ద్వేషం, కూడా వున్నాయి. ఇటు శేషు శశిరేఖకు స్నేహితుడిగా మారాలని ప్రయత్నించే రోజులు కూడా అవే. శేషు సాదాకుటుంబీకుడై ఆమె స్నేహితుడయితే శశిరేఖ జీవితం మరో విధంగా సాగేది. కానీ శేషు ధనవంతుడు. అందుకుతోడు ఎదుటివ్యక్తి అడక్కుండా జాలిపడి సహాయంచేసే నైజం అతనిది. అందుకే అతను శశిరేఖల బీదరికం చూసి జాలిపడి త్యాగంచేటివి చేయాలనే వుద్దేశంతో కాకపోయినా బీదరికం నుంచి ఆమెను ఎలాగైనా తప్పించాలనీ ఆమె జీవితాన్ని మరో మార్గాన మళ్ళించి, కొత్త జీవితం ప్రసాదించాలనీ ప్రయత్నం చేసేవాడు. శేషు ఆ విధంగా ముందుకు వచ్చినప్పుడు - అతను తెచ్చిన కానుకలూ, అతనికళ్ళల్లో జాలీ ఆమెకు అసహ్యం తెప్పించి ఆ వస్తువులు దోకు కల్గించేవి. తనతోపాటు సమానంగా కాక వున్నతమైన ఆసనం మీద కూర్చుని సానుభూతి కురిపించడం చూస్తే అతని నైజం పట్ల విరక్తి కలిగేది. అందుకే తన అసహనాన్ని శేషుని కొట్టీ, అతని వస్తువులు నాశనంచేసి కసి తీర్చుకునేది చిన్నప్పటినుంచీ కూడా. అయితే శశిరేఖ ఆడది. ఆమెలో ప్రేమించే నైజం తుదివిజయం పట్ల మోజూ—ద్వేషం పొరల్లోంచి మిణుకు మిణుకుమని మెరిసే తృష్ణా వున్నాయి. అవి శేషుని ఎరుగును. శేషు తనకు కాకుండా పోతున్నాడనే దుగ్గా వుంది. కానీ ఎలా దక్కించుకోవాలో ఆమెకు తెలిసేదికాదు. అతను చదువుకోసం వూరు విడిచి వెళ్ళినప్పుడు నిజంగా శశిరేఖ దుఃఖించింది. ఆ దుఃఖంతో ఆమె లోపలి ఓకటు కరిగిపోకుండా 'కంపాస్ బాక్స్'లో అతను పెట్టిన లోలకులు చూడ్డంతో తిరిగి అసహ్యం జ్వాలలా రేగింది. జ్ఞాపకాన్ని మాటలతో కాకుండా డబ్బుతో తాపడం చేస్తున్నాడనుకుంది.

అయినా శశిరేఖ శేషుని అంత మాత్రాన మర్చిపోలేదు. అతని బుగ్గ మీద అందమైన పుట్టుమచ్చ మర్చిపోలేని మూలంగానే నాలుగేళ్ళ తర్వాత గుర్తుపట్టి పలకరించింది. ఇక శేషు త్వరపడి లక్ష్మమ్మగారి ముందు సానుభూతితో తన 'చారిటీ'ని నిరూపించుకుని వాగ్దానంచేసి వుండకపోతే శశిరేఖ తప్పకుండా అతన్ని గౌరవించేది. ప్రేమతో జయించలేని, ప్రేమగా మాట్లాడ్డం తెలియని మనిషి, తన హోదాతో, డబ్బుతో తల్లిని మభ్యపెట్టాడని నిలువంతా నిప్పులు చెరిగింది. వాళ్ళిద్దరూ ఒకటి కాకుండా పోవడానికి ఈ రెండు కారణాలే నాకు కన్పించాయి.

అయితే రామారావులాంటి భర్త లభించినందుకు శశిరేఖ జీవితం మూడు పూవులూ, ఆరు కాయలుగా జరిగి పోవల్సిందే. కానీ రామారావు వింత మనిషి. శాపగ్రస్తుడు. శేషువల్ల చిత్తయిన ఆమె హృదయాన్ని నవనీతంతో ప్రక్షాళన చేయడంపోయి తన మానసిక దౌర్బల్యాలతో ఆమెను చిత్తుచేశాడు. భర్తలో—మనిషిని ప్రేమించే సహజమైన గుణం ఆమెకు కనబడలేదు. ఆమె వేటినైతే ద్వేషిస్తుందో వాటినే అతను ప్రేమిస్తాడు. పైగా డబ్బుని మోహించడం అతని జీవిత లక్ష్యంలా కనబడుతుంది. రామారావు ఈ అవాస్తవికతలతో సాలిగూళ్ళు అల్లుకుంటూ శశిరేఖని కూడా వాటికి ఎరచేశాడు. అదే శశిరేఖ జీవితంలో ఆఖరిఘట్టం. శేషుని ద్వేషించడం మటుకే చేస్తూ ప్రేమించానని తెల్సుకోలేని శశిరేఖ—రామారావు అనే తనని, భర్తగా పూజించి కూడా విఫలమయిందని, అతనికి తెలియదు. ఇక శేషు—శశిరేఖ కళ్ళతో బెదిరించినా, కొట్టినా ఎప్పుడూ కూడా కిం మనకుండానే వున్నాడు. ఒక విధంగా శేషుని అదుపులో వుంచింది ఆమే. ఆమెనూ, ఆమె శాపాన్నీ తెలియని అతను ఏకాంతంలో శశిరేఖని తన ఆలోచనల నిండుగా నింపుకుని జీవించాడనేది సత్యం. అదే అతని పాలిటి ద్వేషాన్నీ, ఈర్ష్యనీ పటాపంచలు చేయగల జ్యోతి. ఆ వెలుగు మూలంగానే శశిరేఖ తిరస్కరించినా నిలవగల్గి మరొకరి భార్య అయినా సహించాడు. తనతో జీవితాన్ని పంచుకోని ఆడదానికి భిక్ష పెట్టడానికి ముందుకు వచ్చాడు. కానీ శేషుకి తెలియంది కూడా ఒకటి వుంది—శశిరేఖ తనని ప్రేమిస్తూనే వుందనీ, ఎప్పటికీ ప్రేమిస్తుందనీ, అందుకే తనని ద్వేషిస్తున్నదనీ...

సహజ సిద్ధమైన శక్తులద్వారా ప్రపంచాన్ని క్షాళితం, పునీతం చేయగల్గిన ప్రేమించే గుణం—దారులన్నీ మూసుకుపోతే గతితప్పి వూపిరి ఆడక నిల్చిపోదు. గాలిలో కలిసిపోయి హోరుతో, తుఫాను రూపంలో, నిప్పులు కురిసే నక్షత్రాల ఆకారంలో, వ్యధపెట్టే కిరణాల జాలుగా — తిరిగి ప్రకృతిలోకి జొరబడుతుంది. వగనైన, పగనైన మనిషిని పట్టి బంధిస్తుంది, ఆ శక్తి.

● ● ●

వేయి వరహాలు చేసే శ్రీ శ్రీ గారి 'ప్రేయసీ నీపేరు రాక్షసి' కన్నా అందమైన, భయంకరమైన ఉవాచ ఎక్కడ దొరుకుతుంది నాకు ? అందుకే ఆయన కలంచిందిన ఈ అణిముత్యాన్ని ఉపయోగించుకున్నాను. ఆ మహాకవికి నా కృతజ్ఞతలు.

రచయిత.

□□□